క్లుప్తంగా

ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఆదివారం ఓం శక్తి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు తమిళనాడులోని మేల్ మరువత్తురు అమ్మవారి దేవాలయానికి బయల్దేరి వెళ్లారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు

కార్వేటినగరం: విద్యుత్ బిల్లులను క్యూఆర్ కోడ్ ద్వారా కూడా చెల్లింపులు చేసుకోవచ్చని విద్యుత్ ఏడీఈ చంద్రబాబు అన్నారు. ఆదివారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులను క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించడం మరింత సులభతరంగా మారిందన్నారు. జనవరి విద్యుత్ బిల్లులో నెల చార్జీలతో పాటు క్యూఆర్ కోడ్‌ను ముద్రించామన్నారు. వినియోగదారులు ఆ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. ఏడీఈ వెంట ఇన్‌చార్జి ఏఈ రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

రేపు చేపల చెరువు వేలం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామ పంచాయితీ పరిధిలోని చెరువు, గుంటలో చేపలు పెంచుకోవడానికి వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

గాండ్ల కులస్తుల అభివృద్ధికి కృషి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గౌనివారి శ్రీనివాసులు

కార్వేటినగరం: గాండ్ల కులస్తుల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కార్వేటినగరంలో నిర్వహించిన గాండ్ల కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గాండ్ల కులస్తులు వెనుకబాటు తనానికి ఇంకా గురవుతూనే ఉన్నారని, వీరి అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం గాండ్ల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చెంగల్రాయయాదవ్, జనార్దన్‌రాజు, తిరుమల నాథ్, రాజేంద్రరెడ్డి, కృష్ణ, దాము, చెంగల్రాయులు పలువురు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కృష్ణకాంత్

పుత్తూరు: వైద్యాధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని ఆరోగ్య విస్తరణాధికారులు, సామాజిక ఆరోగ్య అధికారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శివయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సంఘం ఏర్పాటు చేసిన 2025 క్యాలెండర్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకాంత్ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎం.నరసింహప్రసాద్, నాయకులు ఎస్.వేణుగోపాల్, డీఎస్ వెంకటేశులు, కె.రమేష్‌బాబు, పి.రవిచంద్రరాజు, అన్నాదొరై, వేణుగోపాల్ పాల్గొన్నారు.

7న చిత్తూరులో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో కొంగారెడ్డిపల్లెలోని తమ కళాశాలలో ఈనెల 7న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్, చెన్నైకు చెందిన పేరొందిన కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, గత విద్యా సంవత్సరంలో పాసైన డిగ్రీ, ఇంజినీరింగ్, ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94932 10966 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఓం శక్తి పూజలు

ఐరాల: మండలంలోని చిన్నవెంకటంపల్లెలో ఆదివారం గంగమ్మ ఆలయంలో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఓం శక్తి పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు. ఆలయ నిర్వాహకుడు భరత్ ఆధ్వర్యంలో మహిళా భక్తులు ఇరుముడులతో మేల్‌వరవత్తూర్‌కు బయలుదేరారు. అమ్మవారికి ఇరుముడులు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటామన్నారు.

పది విజయానికి ప్రణాళిక సిద్ధం

- పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- పక్కా ప్రణాళికతో ముందుకు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు


ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

వడమాలపేట (విజయపురం): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి పరీక్ష చాలా ముఖ్యం. పది తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎన్నుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదో తరగతి మార్కులు కీలకం. దానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఎప్పటికప్పుడు ఎసైన్ మెంట్లు, మాక్ టెస్టులు పెడుతూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

టాప్ ర్యాంక్ సాధించాలని...

జిల్లాలో మంచి ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారు. వడమాలపేట మండలంలో మొత్తం ఆరు ఉన్నత పాఠశాల ఉండగా, 262 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తూ, విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి, వారి మదింపు అంచనా వేసి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకొంటున్నారు. పదో తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షల నిర్వహిస్తూ, ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి తృతీయ స్థానంలో ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రోజూ ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్ట్ వంతున వారానికి 7 సబ్జెక్టులు బోధన చేస్తూ, సమ్మేటివ్-1 , సమ్మేటివ్-2 పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తిస్తున్నారు.

మంచి పట్టు సాధిస్తున్నాను



పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ రివిజన్ చేసుకొంటున్నాం. నాకు గణితం, ఇంగ్లిష్ అంటే బా గా ఇష్టం. వాటితో పాటు అన్ని సబ్జెక్ట్‌లో మంచి నైపుణ్యం సాధించడానికి అనుకూలంగా ఉంది.
– వి. మానస, ఎస్‌బీఆర్‌పురం ఉన్నత పాఠశాల

ప్రయోజనకరంగా ఉంది



ప్రత్యేక తరగతులు నిర్వహించడం మాకు ప్రయోజనకరంగా ఉంది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, విద్యను అందిస్తున్నారు. మాకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొంటున్నాం. మంచి మార్కులు సాధించడానికి కఠోరంగా చదువుతున్నాను.
– భరత్, ఎస్‌బీఆర్‌పురం, దమాలపేట.

పరీక్ష అంటే భయం లేదు



ఇది వరకు పరీక్ష అంటే కొంత గిలి ఉండేది. అయితే ఉదయం, సాయంత్రం పత్యేక తరగతులు నిర్వహిస్తుండంతో భయం పోయింది. ప్రత్యేక తరగతిలో మంచిగా చదువుకొంటున్నాం. ఉపాధ్యాయులు కూడా మాకు మంచి ధైర్యం చూపుతున్నారు. పది పరీక్షలో పది పాయింట్లు సాధిస్తానన్న నమ్మకం వచ్చింది.
– నీలేష్, ఎస్‌బీఆర్‌పురం, వడమాలపేట

ప్రణాళిక అమలు చేస్తున్నాం



మా పాఠశాలలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు భయపడకుండా సలహాలు ఇస్తున్నాం. చదువులో వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, మొదటి స్థానం సాధించడానికి ప్రయత్నం చేస్తున్నాం.
– బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎం, ఎస్‌బీఆర్‌పురం ఉన్నత పాఠశాల

ఆగిన రోడ్డు పనులు


ఆగిన కేబీఆర్‌పురం ఏఏడబ్ల్యూ రోడ్డు పనులు

పుత్తూరు: మండల పరిధిలోని కేబీఆర్‌పురం ఏఏడబ్ల్యూలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. గ్రామస్తులు గత కొంత కాలంగా రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుతం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామంలోకి 50 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరైంది. గత నాలుగు రోజుల క్రితం పనులు చేపట్టారు. రోడ్డు పనులు జరగాలంటే ఆక్రమణలు పూర్తిగా తొలగించి రోడ్డు వేయాలని ఓ వర్గం వారు పట్టుపడుతున్నారు. మరో వర్గం వారు ఒరవ కాల్వ పక్కగా స్థలాన్ని తీసుకొని రోడ్డు పనులు పూర్తి చేయాలని సూచిస్తోంది. ఇరిగేషన్ శాఖ పరిధిలోని కాలు స్థలంలో తాము రోడ్డు పనులు చేపట్టలేమని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తేల్చి చెబుతున్నారు. రెవెన్యూ శాఖ సర్వే నిర్వహించిన తర్వాత రోడ్డు వేయాలని ఓ వర్గం వారు రోడ్డు పనులను అడ్డుకోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ సంఘటనపై పంచాయతీరాజ్ ఏఈ గాయత్రి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కనీసం 4 మీటర్ల వెడల్పు లేనిదే రోడ్డు వేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఇక్కడి పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకు స్థలాన్ని చూపిన తర్వాత పనులు చేపడుతామని స్పష్టం చేశారు.

ప్రయాణం... ప్రమాదకరం


ఎస్‌బీఆర్‌పురం చెరువు కట్టపై దారి

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం చెరువు కట్టపై రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. వాహన చోదకులు ఏ మాత్రం అదమరిచినా ప్రమాదాలకు గురి కావాల్సిందే. ప్రమాదకర రహదారుల వద్ద ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. కట్టలకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న కంపచెట్లను తొలగించడం లేదు. మలుపుల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. ఎస్‌బీఆర్, ఆదిఆంధ్రవాడకు వెళ్లే చెరువుకట్ట ప్రమాదకర మలుపులతో ఉంది. ఈ గ్రామానికి చెందిన ప్రజలు తిరుపతి, పుత్తూరు పట్టణాలకు రావాలంటే చెరువుకట్టపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ లైట్లు లేకపోవడంతో మలుపులు తిరిగే సమయంలో వాహనాలు చెరువులో పడే అవకాశం ఎక్కువగా ఉందని, రోడ్డుకు ఇరువైపులా ఇనుప గోడలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకు బీమా


బీమా నమోదులో అసోసియేషన్ సభ్యులు

నగరి: మండల ఎలక్ట్రికల్ అసోసియేషన్‌వారు ఆదివారం అసోసియేషన్‌లోని సభ్యులకు బీమా సౌకర్యం కల్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ రవి సభ్యుల వివరాలు సేకరించి ప్రమాద బీమాను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంబంధిత పనులు ప్రమాదంతో కూడుకున్నదని బీమా వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

భద్రత కరువు

- ఏటీఎంల వద్ద కనిపించని సెక్యూరిటీ గార్డులు
- తరచూ సాంకేతిక సమస్యలతో తప్పని తిప్పలు


పుత్తూరు పట్టణంలో అవుట్ ఆఫ్ సర్వీస్‌తో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలు

విజయపురం: వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు పట్టణ, గ్రామాల్లో బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేస్తున్నాయి. నియోజకవర్గంలోని పట్టణ, మండలాల్లో ఏటీఎంల నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. నగరి నియోజకవర్గ పరిధిలో దాదాపు 25కు పైగా బ్యాంకులు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 30కిపైగా ఏటీఎం కేంద్రాలు ఉన్నాయి. కానీ కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడం లేదు. మిషన్‌లో డబ్బులు పెట్టి ఆ తరువాత వాటి భద్రతను గాలికి వదిలేస్తున్నారని కనీసం వాటిని పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదని వినియోగదారులు అంటున్నారు. ప్రతి రోజూ లక్షలు డ్రా చేసే కేంద్రాల వద్ద కనీసం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత బ్యాంకులపైనే ఉంది. అయినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. ముందస్తు భద్రత ఏర్పాటు చేస్తే బాగుంటుందని హితవు పలుకుతున్నారు.

తరచుగా సాంకేతిక సమస్యలు

ఏటీఎం కేంద్రాల్లో చాలా వరకు ఏసీలు పనిచేయడం లేదు. ఆర్థిక భారం పడుతుందని బ్యాంకులు ఇలా చేస్తున్నాయనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇలాగే ఉంటే రానున్న వేసవిలో ఇబ్బంది తప్పదు. అలాగే ఎప్పుడు చూసిన సాంకేతిక కారణాలతో పని చేయడం లేదనో, ఏటీఎంలో నో మనీ అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి. నెల మొదటి వారంలో నాలుగైదు ఏటీఎం సెంటర్లకు తిరిగినా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు అంతా ఏటీఎంలలోనే అధికంగా నగదు డ్రా చేస్తుంటారు. ఎక్కువ శాతం ఏటీఎం కేంద్రాల వద్ద నగదు లేదు అని, ఔట్ ఆఫ్ సర్వీస్ లని బోర్డులు దర్శనమిస్తుండడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న జీడీ నెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి, నివాళులర్పిస్తున్న చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంసీ విజయానందరెడ్డి

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు మోహన్(జోయ్) మామగారైన జ్ఞానశేఖర్ గతవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం కర్మక్రియల కార్యక్రమానికి వైఎస్‌ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మీ, చిత్తూరు ఇన్‌చార్జి ఎంసీ విజయానందరెడ్డి పరామర్శించారు. జగనన్న కాలనీలో నిర్వహించిన కర్మ క్రియల కార్యక్రమంలో జ్ఞానశేఖర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, ఢిల్లీకుమార్, జగదీష్ బాబు, మదన్, గౌతమ్, వరప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం


విజయానందరెడ్డిని సన్మానిస్తున్న క్రీడాకారులు

శ్రీరంగరాజపురం: మానసిక ఉల్లాసం కోసం యువతకు క్రీడలు ఎంతో అవసరమని వైఎస్ ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గం సమన్వయ కర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్లు భువనేష్, యువరాజ్, తేజు ప్రసాద్, గిరిచౌదరి, లలిత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయానందరెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులతో ఆయన ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సీపీ క్రీడాభివృద్ధికి ఎక్కువ నిధులను మంజూరు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించిందని తెలిపారు. నేటి గ్రామీణ క్రీడాకారులే రేపటి జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డి.వి.ఢిల్లయ్య, నాయకులు విజయబాబు, కోటిరెడ్డిబాబు, దేవరాజురెడ్డి, యుగంధర్, సుధాకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నగరి: మండలంలోని తడుకుపేట గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో తడుకుపేటలో దళితులపై జరిగిన దుశ్చర్యను వారు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న నగరిలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. స్కూల్ పిల్లలు, మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు తడుకుపేట గ్రామంలో ప్రశాంత వాతావరణం తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మురళి, సతీష్, డీహెచ్‌పీఎస్ నాయకులు ప్రకాష్, వివేక్, రంజిత్, ఏఐటీయూసీ నాయకులు చిన్నరాసు పాల్గొన్నారు.

పేదలకు ఫిజియోథెరపీ సేవలు అందాలి



యువ ఫిజియోథెరపిస్టులతో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు: పేదలకు సైతం ఫిజియోథెరపీ వైద్య సేవలు ఉచితంగా అందించాలని, ఇందుకు ప్రభుత్వం యువ ఫిజియోథెరపిస్టులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో నియమించాలని ప్రముఖ రిటైర్డ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక కేకేసీ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బ్యాచ్‌కు చెందిన గ్రాడ్యుయేషన్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పుత్తూరు పట్టణం నుంచి తొలిసారిగా 22 మంది యువ ఫిజియోథెరపీ డాక్టర్లు సమాజంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. వీరిలో ముగ్గురు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించడం కేకేసీ కళాశాల ప్రమాణాలకు నిదర్శనమన్నారు. అయితే పట్టాలు అందుకొన్న యువ ఫిజియోథెరపిస్టులు కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు పరిమితం కాకుండా చిన్న చిన్న పట్టణాల్లో సైతం తమ సేవలందించాలని సూచించారు. ప్రముఖ చిల్డ్రన్స్ డాక్టర్ ఎ.ఆర్ముగం మాట్లాడుతూ వైద్య వృత్తిని సేవా దృక్పథంతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్స్ ఎం.సురేష్ పద్మజ, కె.నరసింహారావు, మంజుల, కె.రవిశేఖర్, వైష్ణవి, ప్రిన్సిపల్ ఎం.ఎస్.మాగేష్, వైస్ ప్రిన్సిపల్ రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండలపై రాళ్లు.... ఆ కొండలకే పేరు


నామాల కొండ


శంఖు కొండ


ముక్కుకొండ

నగరి: ప్రకృతి భగవంతుడు సృష్టించిన అద్భుత సంపద. ఇలా సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు, వాగులు మానవాళికి కనువిందు చేస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటాయి. భగవంతుడు కొండలను సృష్టిస్తే ఆ కొండలపై విచిత్రంగా కనిపించే రాళ్లే ఆ కొండలకు పేర్లుగా మారిపోయాయి. ఇలా వింత పేర్లు గల కొండలు నగరి నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి.

నామాల కొండ

ఈ కొండ పుత్తూరు నుంచి నగరికి వచ్చే ముఖద్వారంలో ఉంది. సుమారు 500 మీటర్ల ఎత్తులో తిరుమలకు అభిముఖంగా ఉన్న ఈ కొండపై ఉన్న మూడు రాళ్లు వెంకటేశ్వర స్వామి నామాల ఆకృతిలో ఉంటాయి. కొండపైకి వెళ్లిన వారు పైపైనే నిలబడి ఉన్న ఈ రాళ్లను చూసి ఎక్కువరోజులు ఇవి నిలబడవని, పడిపోతాయని దశాబ్దాల తరబడి చెప్పుకుంటున్నారు.

అయితే నేటి వరకు ఈ రాళ్లు చెక్కుచెదరలేదు. ఎంతటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ఎలాంటి మార్పు లేకుండా ఈ రాళ్లు నిలబడి ఉంది. పర్వదినాల్లో పలువురు ఈ రాళ్ల వింతను చూడడానికి వెళుతుంటారు. రాళ్ల పక్కన నిలబడి ఫొటోలు తీసుకుంటారు. ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే వారు ఈ కొండ వద్ద ఆగి మొక్కుకొని వెళుతూ ఉంటారు. ఈ కొండ అంచుల్లో అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించారు.

శంఖు కొండ

ఈ కొండ కూడా నగరి–పుత్తూరు మార్గంలో ఉంది. అతి పెద్దగా ఉండే ఈ కొండపై ఉన్న రాయి శంఖు ఆకారంలో ఉంటుంది. దీంతో ఈ కొండను శంఖు కొండ అని పిలుస్తారు. ఒక కొండపై వెంకటేశ్వర స్వామి నామాలు ఉంటే, మరో కొండపై శంఖు ఉందని స్థానికుల నమ్మకం. భక్తులు కొండపై ఉన్న శంఖురాయికి పసుపుపూసి పూజలు చేస్తారు. కొందరు ఈ రాయి పాలాడిలా భావించి పాలాడి కొండ అని పిలుచుకుంటారు. సుమన్, భానుచందర్‌లు నటించిన మెరుపుదాడి చిత్రం ఈ శంఖురాయి పక్కనే చిత్రీకరించారు. అతిపెద్దగా ఉన్న కొండ సగానికి పైగా మైనింగ్‌లో తవ్వేశారు. శంఖు రాయి అడుగున ఉన్న భాగాన్ని కూడా తవ్వేస్తున్నారు. కొన్నేళ్లపోతే పాలాడ రాయి మాత్రమే ఉంటుందేమో.. కొండ ఉండదేమో అని స్థానికులు చెబుతున్నారు.

ముక్కుకొండ

నగరి పట్టణం నుంచి పుత్తూరుకు వెళ్లే మార్గంలో 7 కిలో మీటర్ల దూరంలో ఈ కొండ ఉంది. కొండపై ఉన్నభాగం హనుమంతుని ముక్కు ఆకారంలో ఉండటంతో కొండకు ముక్కు కొండ అని పేరు వచ్చింది. జాతీయ రహదారిలో సుదూర ప్రాంతం వరకు ఈ కొండ కనిపిస్తుంది. సముద్ర మట్టానికి 855 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కొండపై వెలిగించే దీపం గతంలో మద్రాసు హార్బర్‌కు వచ్చే నౌకలకు లైట్ హౌస్‌లా ఉపయోగపడేది. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం సముదాయం గ్రామంలోని అవనాక్షమ్మ ఆలయ సమీపం నుంచి ఈ కొండపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లవచ్చు. వెళ్లేదారి రాళ్లు, ముళ్లకంపలు, పొదలతో నిండి చిట్టడవిలా ఉంటుంది. నాశికలా ఉన్న ఈ గిరి పక్కనే ఉన్న ఊరు కావడంతో నగరి అన్న పేరు వచ్చిందన్నది నానుడి. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఈ కొండ పక్కనే బ్రిటీష్ మిలటరీ వారు నివశించారు. ఆ సమయంలో ఎత్తుగా ఉన్న ఈ కొండను మోర్ కొండ అనే వారు. దీంతో కొండపక్కనే ఏర్పడిన ఊరుకు మోరుకొండ కండ్రిగ అని పేరువచ్చింది.

అక్రమ మద్యం స్వాధీనం


మద్యం విక్రయిస్తున్న దుకాణం

గంగాధరనెల్లూరు: అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం గంగాధరనెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల వివరాలిలా ఉన్నాయి. జీడీనెల్లూరు తానా జంక్షన్ వద్ద చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఏలుమలై అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఏలుమలైని పట్టుకుని, 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏలుమలైపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609